క్లుప్తంగా

ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీలు పెరిగేలా ఆశా వర్కర్లు కృషిచేయాలని పీహెచ్‌సీ డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిల్‌కారీ యాప్ పూర్తి సమాచారాన్ని గర్భిణులకు వివరించాలన్నారు. ఆశా వర్కర్లు అందరి వద్ద ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉండాలన్నారు. ఆశా వర్కర్లకు ఇచ్చిన లక్ష్యాలను ఈ–ఆస్కా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.చిన్నారావు పాల్గొన్నారు.

758 మందికి వైద్యసేవలు



జి.యర్రంపాలెంలో వైద్యశిబిరం

రాజానగరం: మండలంలోని జి.యర్రంపాలెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్ పర్యవేక్షణలో శిబిరానికి వచ్చిన 758 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 155 మంది కంటి వైద్య పరీక్షలు చేయించున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కంటి వెలుగు పథకంలో 86 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కాగా.. మండలంలోని కొత్త తుంగపాడులో బుధవారం వైద్యశిబిరం నిర్వహించనున్నారు.

వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపూడి: పెదపూడి గ్రామం సచివాలయం–2లో ఖాళీగా ఉన్న వలంటీర్ ఉద్యోగానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ వీవీ సాయిబాబా తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పెదపూడి గ్రామంలో జనరల్ కేటగిరీ విభాగంలో వలంటీర్ ఉద్యోగానికి బుధవారం నుంచి ఈ నెల 11లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటి ఆపరేషన్లకు తరలింపు



కంటి ఆపరేషన్‌కు వెళుతున్న రోగులతో వైద్య సిబ్బంది

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన 20 మందిని కంటి ఆపరేషన్ల కోసం రాజమహేంద్రవరం తరలించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.వసుంధర తెలిపారు. మంగళవారం కొంకుదురు పీహెచ్‌సీలో ఆమె అధ్యక్షతన బంగారు తల్లుల పలకరింపు కార్యక్రమంపై ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల మండలంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని ఆపరేషన్ కోసం రాజమహేంద్రవరం తరలించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

బిక్కవోలు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో గురువారం నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి 23వ తేదీ వరకూ ×ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..₹ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 9న బిక్కవోలు–3 సచివాలయం, 10న బిక్కవోలు–2, 14న బిక్కవోలు–1, 15న బలభద్రపురం–3, 16న బలభద్రపురం–2, 17న బలభద్రపురం–1, 20న ఆరికరేవుల, 21న కొంకుదురు–2, 22న మెళ్లూరు, 23న పందలపాక–1 సచివాలయాల్లో నిర్వహించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు. నోడల్ అధికారిగా పంచాయతీ విస్తరణాధికారి వ్యవహరిస్తారన్నారు.

టీడీపీ నాయకులకు నోటీసులు

రంగంపేట: అనపర్తి టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో పాటు రంగంపేట మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులకు పోలీసులు 41ఏ నోటీసులు అందించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పి.విజయ్‌కుమార్ మాజీ ఎమ్మెల్యేతో పాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబుతో పాటు మరి కొందరు నాయకులకు నోటీసులు అందించారు. మండలంలో ఇటీవల చంద్రబాబునాయుడు అరెస్టు, చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని వీరు నిరసన కార్యక్రమాలు చేశారు. అనుమతులు లేకుండా ఆయా కార్యక్రమాలు చేపట్టారని కేసులు నమోదు చేసిన పోలీసులు, తాజాగా వారికి నోటీసులు అందించారు.

విద్యాబోధనలో వినూత్న మార్పులు

- ప్రాథమిక, పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు
- మెరుగైన అభ్యసనానికి ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ
- కొండగుంటూరులో తరగతులు

రాజానగరం: రాష్ట్రంలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు బోధన విధానాలలో సమూలంగా ఆధునిక మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. నర్సరీ నుంచి నూతన విధానాలను అమలు చేస్తూ, అందుకు అవసరమైన శిక్షణ తరగతులను నిర్వహిస్తూ, బోధకులను అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇందులో భాగంగా పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమాన్ని చేపట్టింది.

11 వరకూ శిక్షణ తరగతులు

కొండగుంటూరులోని సత్య పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఎఫ్‌ఎల్‌ఎన్‌పై ప్రస్తుతం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 11వ తేదీ వరకూ ఇవి కొనసాగుతాయి. మండలానికి ముగ్గురు ఎస్‌జీటీ ఉపాధ్యాయులను డీఆర్పీలుగా ఎంపిక చేసి, వారికి రెసిడెన్షియల్ మోడ్‌లో శిక్షణ నిచ్చారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి స్పెల్‌లో కాకినాడ, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 174 మంది శిక్షణ పొందారు. ఈ నెల 4 వరకూ జరిగిన సెకండ్ స్పెల్‌లో కోనసీమ, అల్లూరి సీతారామరాజు, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన 194 డీఆర్పీలు శిక్షణ పొందారు. 6వ తేదీన ప్రారంభమైన మూడవ స్పెల్ శిక్షణ ఈ నెల 11 వరకూ జరుగుతుంది. దీనిలో కోనసీమ, అల్లూరి సీతారామరాజు, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన 170 మంది శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం డీఆర్పీలు ఆయా మండలాలకు వెళ్లి, అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఒకటి, రెండు తరగతులు బోధించే ఎస్‌జీటీలకు మండల స్థాయిలో శిక్షణ ఇవ్వాలి.



శిక్షణలో భాగంగా కృత్యాలు ప్రదర్శిస్తున్న డీఆర్పీలు

సమగ్రాభివృద్ధి సాధ్యం



ఎఫ్‌ఎల్‌ఎన్ ద్వారా చిన్నారుల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. మూడు నుంచి ఎనిమిదేళ్ల వయసు వచ్చే సరికీ ప్రాథమిక విద్య బలోపేతంలో భాగంగా పునాది విద్యను పటిష్టం చేయడం జరుగుతుంది. అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ పొందిన డీఆర్పీలు శిక్షణ ఇస్తారు.

– కళావతి, డైట్ లెక్చరర్, కీరీసోర్స్ పర్సన్, డైట్, బొమ్మూరు

మెరుగైన ఫలితాల కోసమే



ఎఫ్‌ఎల్‌ఎన్‌లో భాగంగా ఇప్పటికే 65 రోజుల శిక్షణలో భాగంగా ఇప్పటికే డీఆర్పీలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. రెండవ దశ 120 రోజుల శిక్షణ పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్యను బోధించే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్‌జీటీలకు శిక్షణ ఇచ్చే డీఆర్పీలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ప్రాథమిక విద్య పటిష్టానికి, మెరుగైన ఫలితాలను అందుకోవడానికి ఎఫ్‌ఎల్‌ఎన్ తోడ్పడుతుంది.

– అరవ ప్రభాకర్, రాష్ట్ర పరిశీలకులు, విజయవాడ

వైద్యశిబిరాల్లో 13,043 మందికి సేవలు



పీఎస్ నరేష్‌కుమార్, ఎంపీడీఓ

మధురపూడి: కోరుకొండ మండలంలోని 22 గ్రామాలకు చెందిన 24 సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా 13,043 మంది రోగులకు వైద్యసేవలు అందించినట్టు ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ తెలిపారు. 733 మందిని మెరుగైన చికిత్స కోసం ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యులు అందించిన సేవలు మరువలేనివన్నారు. సచివాలయం సెక్రటరీలు, సిబ్బంది, రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన సిబ్బంది సహకారంతో వీటిని నిర్వహించ గలిగామన్నారు. కంటి సమస్యలున్న వారికి కళ్లజోళ్లు అందించినట్టు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బొబ్బిల్లంక గ్రామానికి చెందిన కొండేటి దుర్గారావును అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ ఆరు మద్యం బాటిళ్లు, 650 ఎంఎల్ ఐదు బీర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజలంతా సీఎం జగన్ వెంటే..

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని, ఆయనను మరోసారి సీఎంగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందేవని, ప్రస్తుతం జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు నేరుగా పేదల ఇంటి వద్దకే చేరుతున్నాయని పేర్కొన్నారు సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు.

టీడీపీ కంచుకోటలో ఎమ్మెల్యేకు విశేష ఆదరణ

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా ఉన్న పెదపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీకి అపూర్వ ఆదరణ పెరుగుతోంది. ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, పెద్దఎత్తున హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, బీసీ సెల్ మండల కన్వీనర్ పప్పు సింహాచలం, పంపన రమణ, రైతు విభాగం మండల కన్వీనర్ మార్ని వెంకట్రావు, మాజీ ఎంపీపీ యార్లగడ్డ లక్ష్మీకాంతం నారాయణరావు, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంబరం.. గ్రామాల్లో ఉత్సాహం



ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఆకట్టుకున్న ట్రాక్టర్ల ర్యాలీ
- అన్నదాతలతో సందడి చేసిన ఎమ్మెల్యే రాజా

మధురపూడి: వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేసిన విషయం తెలిసిందే. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో జిల్లాస్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతుల సంబరాలు అంబరాన్ని అంటాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఉత్సాహం శ్రీరంగపట్నానికి చేరుకున్నారు. ముందుగా గాడాల నుంచి శ్రీరంగపట్నం వరకూ ట్రాక్టర్లతో ప్రదర్శన నిర్వహించారు. తొలుత బూరుగుపూడి నుంచి వివిధ ప్రాంతాల నుంచి రైతులు ట్రాక్టర్లపై గాడాల చేరుకున్నారు. అక్కడి నుంచి మధురపూడి, విమానాశ్రయం, బూరుగుపూడి, బూరుగుపూడి జంక్షన్, కాపవరం, కోరుకొండ మీదుగా శ్రీరంగపట్నం వచ్చారు. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తొలుత గాడాలలో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ దేవత పొన్నాలమ్మను దర్శించుకున్నారు. ట్రాక్టర్ల ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. ముందు ట్రాక్టర్‌లో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కూర్చుని, రైతులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ గణేశుల పోసి, వ్యవసాయ విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ రాజానగరం మండల కన్వీనర్ దూలం పెద్ద, సీతానగరం మండలం కన్వీనర్ గంటా శ్రీను, మాజీ మండల కన్వీనర్ మందారపు వీర్రాజు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్ తేజ, సర్పంచుల సమాఖ్య కోరుకొండ మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, రైతులు మద్దాల రమణ, చాటపర్తి దుర్గారావు, ఉల్లి అప్పన్న దొర, చీంద్రం శ్రీహరి వర్మ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ప్రజలకు వివరించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రజా సంక్షేమ పాలనను వివరించడంతో పాటు వైఎస్సార్ సీపీని ప్రజలకు చేరువ చేయడం ద్వారా రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపొందేందుకు పార్టీ సోషల్ మీడియా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు, సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని ప్రజలకు చేరువ చేయడంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రముఖపాత్ర పోషించిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై మరింత విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని, అందుకు ప్రతిఒక్కరూ మరింత కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర సజ్జల భార్గవ్ టీం జిల్లా ఇంచార్జ్ ఇమ్రాన్, జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్లు నల్లమిల్లి వేణురెడ్డి, డాక్టర్ కుమార్ గౌడ, అనపర్తి సోషల్ మీడియా బృంద సభ్యులు చంటి, నేకూరి రాజు, జానకిరామయ్య, అడబాల శివ, సత్తిబాబు, గోపి, బషీర్, అనపర్తి నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీ కన్వీనర్లు, కో కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు గోకవరంలో 'జగనన్నకు చెబుదాం'

గోకవరం: స్థానిక గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో బుధవారం తూర్పుగోదావరి కలెక్టర్ కె.మాధవీలత ఆధ్వర్యంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీఓ కె.పద్మాజ్యోతి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఇతర మండల ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్

రాజానగరం: గైట్ డిగ్రీ కళాశాల, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ ట్రెండ్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ అనే అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. యూఎస్‌ఏలోని కొలంబస్‌లో పనిచేస్తున్న ఉప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకలింపు చేసుకోవాలన్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలకు సాంకేతిక నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రయ్య, హెచ్‌ఓడీ శేషుకుమార్, బి.సోమరాజు పాల్గొన్నారు.

నన్నయ విద్యార్థికి కాంస్య పతకం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ సెకండియర్ చదువుతున్న తంగెళ్ల షణ్ముఖ శ్రీవంశీ నేషనల్ గేమ్స్ సెపక్ తక్రాలో కాంస్య పతకం సాధించాడు. గోవాలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 3 వరకూ 37వ నేషనల్ గేమ్స్ జరిగాయి. 11 ఏళ్ల తర్వాత సెపక్ తక్రాలో ఏపీ మెడల్ వచ్చిందని, అది కూడా నన్నయ వర్సిటీ విద్యార్థి సాధించడం ఆనందంగా ఉందని వీసీ ఆచార్య కె.పద్మరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని అభినందించారు. సెపక్ తక్రా గేమ్ పట్ల ఆసక్తి చూపే షణ్ముఖ శ్రీవంశీ ఇంతవరకు 8 నేషనల్స్ ఆడాడు. యూనివర్సిటీ ప్రాంగణంలో కూడా సెపక్ తక్రా గేమ్ కోర్టును ఏర్పాటు చేస్తామని వీసీ తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రాజమహేంద్రవరం రూరల్: పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. శిశుసంరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా మంగళవారం బొమ్మూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించాయి.

ముస్లింల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు

- వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ ఆరిఫ్
- సమావేశంలో పలు తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆరిఫ్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ముస్లింల సమస్యలను తెలుసుకుని, వాటిని నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేసి, త్వరితగతిన పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తున్నామని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. మంగళవారం జరిగిన జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యవర్గ సమావేశంలో వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, జిల్లా సభార్డినేట్‌లతో కలిసి పలు తీర్మానాలు చేశారు. ఇమామ్, మోజన్‌లకు ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనాల తీరును పరిశీలించి, స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. షాదీఖానాలు, ధార్మిక కేంద్రాల మరమ్మతులకు సంబంధించి ఎంతో కాలంగా ఉన్న డిమాండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా కబ్జాకు గురైన వక్ఫ్ బోర్డ్ ఆస్తులను గుర్తించామని, న్యాయపరమైన వివాదాలను త్వరితగతిన పరిష్కరించి అవి ముస్లిం సమాజానికి ఉపయోగపడే విధంగా చేస్తామని అన్నారు. ఇప్పటికే ఉర్దూ భాషను ప్రభుత్వం రెండవ అధికారిక భాషగా గుర్తించి, ఉర్దూ పూర్వ వైభవానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ అందజేస్తున్న పథకాల ద్వారా అత్యధికంగా పేదలు ఉన్న ముస్లిం సమాజం ఎంతో లాభపడుతోందన్నారు. అనంతరం రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్‌గా నియమితులైన సయ్యద్ హసీనా బేగంను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ వజీరుద్దీన్, జిల్లా అధికారి మహమ్మద్ షఫీ, జిల్లా సహాయకులు మహమ్మద్ జానీ, జిల్లా డైరెక్టర్లు షట్టర్ బాషా, మహమ్మద్ జఫరుల్లా ఖాన్, షేక్ బిజిలానీ, సయ్యద్ రబ్బానీ, షేక్ ఇబ్రహీం, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎల్ఐసీపై ఇంటింటా అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రసాదరావు, సతీష్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థలో పొదుపు చేసిన ప్రతి రూపాయి.. ప్రజల సంక్షేమానికి, దేశ నిర్మాణానికి ఉపయోగపడుతుందని ఎల్ఐసీ అఖిల భారత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. స్థానిక మోరంపూడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇంటింటికీ ఎల్ఐసీ పోస్టర్‌ను సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాదరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవిత బీమా సంస్థపై అవగాహన కల్పించడానికి పోస్టర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కోదండరామ్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లోని 20 శాఖా కార్యాలయాల పరిధిలో సుమారు పది వేల పోస్టర్లు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. అధ్యక్షుడు జి.రాంబాబు మాట్లాడుతూ జీవిత బీమా సాధించిన ఘనతను ప్రజలకు వివరించి పాలసీల పునరుద్ధరణ, కొత్త పాలసీల తీసుకోవాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ బీఎస్ఎన్ మూర్తి, ఉద్యోగుల సంఘం నాయకులు శిరీష, మాథ్యూస్, సత్యదేవ, గన్నెయ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

19న అఖిల గాండ్ల, తెలికుల కార్తిక వనసమారాధన



విలేకరులతో మాట్లాడుతున్న నరవ గోపాలకృష్ణ, చిత్రంలో దాడి సత్యనారాయణ, భవానీ ప్రియ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అఖిల గాండ్ల, తెలికుల, దేవ తెలికుల సంఘీయుల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారానికి కార్యాచరణలో భాగంగా ఈ నెల 19న రాజమహేంద్రవరంలో కార్తిక వనసమారాధన శంఖారావం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఈ మేరకు కన్వీనర్లు నరవ గోపాలకృష్ణ, నరవ అనంతం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని చందన గార్డెన్స్‌లో జరిగే వనసమారాధన నిర్వహణకు మంగళవారం రాట ముహూర్తం చేశారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ నాయకుడు కోడి ప్రవీణ్‌తో పాటు సంఘ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. నిర్వాహకులు నరవ గోపాలకృష్ణ, నరవ అనంతంతో పాటు విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, అఖిల గాండ్ల, తెలికుల, దేవ తెలికుల కార్పొరేషన్ అధ్యక్షురాలు సంకిస భవానీ ప్రియ, దేవ తెలికుల రాష్ట్ర అధ్యక్షుడు అడ్డాల వెంకట రాజు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సంఘం వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలకృష్ణ పేరును ప్రాంగణానికి, సభ జరిగే మైదానానికి అంబటి సుబ్బన్న అండ్ కంపెనీ, సింగవరపు సాయిబాబా బ్రదర్స్ అండ్ సన్స్ పేరు మీదుగా సభా వేదిక నిర్మాణం చేయనున్నట్టు వివరించారు. 19వ తేదీ ఆదివారం ఉదయం కోటిపల్లి బస్టాండ్ వద్ద నుంచి భారీ ర్యాలీగా సభా వేదిక వద్దకు చేరుకున్న తరువాత సంఘీయుల సమస్యలపై చర్చించి కార్తిక వనసమారాధన, శంఖారావం పూరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సింగవరపు సాయిబాబా, మురపాక వీర్రాజు, అంబటి గురుమూర్తి, కాశిన సత్యనారాయ, వసాది సత్యనారాయణ, పెదబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



విజేతలతో గురుకులం కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: చిత్రలేఖనంతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను సులువుగా గుర్తించవచ్చని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాం సుందర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ప్రపంచశాంతి అనే అంశంపై రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ విద్యార్థులను కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితం చేయకుండా అన్ని అంశాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. గురుకులం ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ మనసులోని వేయి భావాలను ఒక్క చిత్రం ద్వారా గుర్తించవచ్చన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానం సాధించిన గురుకులం విద్యార్థులు ఆర్.హర్షిత్ (9వ తరగతి), కె.ప్రశాంత్ కుమార్ (9వ తరగతి), బి.అఖిలసాయి సంజన (8వ తరగతి)ను లయన్స్ క్లబ్ సభ్యులు గ్రంథి వసంత కుమారి, ఏవీఎస్ సత్యనారాయణ, ఎన్.సతీష్ సత్కరించారు. న్యాయ నిర్ణేతలుగా మోటూరి శ్రీనివాసరావు, డి.శివాజీ వ్యవహరించారు.

గిరిజన సంస్కృతిపై పరిశోధనలు

రాజమహేంద్రవరం రూరల్: గిరిజన సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలపై సమూల పరిశోధన చేయాలని ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్, ట్రైనింగ్ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు అన్నారు. బొమ్మూరులోని గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కేఎన్ జ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం ఆయన గిరిజన సంస్కృతిపై పరిశోధనపై వచ్చిన ప్రత్యేక బృందం ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. చినబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అలనాటి వస్తువులు, వారి సంప్రదాయాలు ఎంతో ముఖ్యమన్నారు. గిరిజనులు వాడే సంప్రదాయ వస్తువులు, ముఖ్యమైన చిహ్నాలు సేకరించి లంబసింగిలో త్వరలో ఏర్పాటు చేయబోయే మ్యూజియంలో పొందుపరచాలన్నారు. సమావేశంలో మ్యూజియం ప్రొఫెసర్ పి.శంకరరావు, పరిపాలనాధికారి వి.సునీత, ఫీల్డ్ ఆఫీసర్ అనురాధ పాల్గొన్నారు.